క్లుప్తంగా

వార్డు మెంబర్‌గా లలితకుమారి ఏకగ్రీవం



నాగలలిత కుమారితో ఎంపీపీ కార్నైర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు

పెరవలి: మండలంలోని అజ్జరం పంచాయతీ రెండో వార్డు మెంబర్‌గా చెంపాటి నాగ లలిత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ, పరిశీలన అనంతరం ఈ వార్డు మెంబర్ పదవికి ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నాయి. ఎన్నిక అనివార్యం అయ్యే పరిస్థితి ఏర్పడింది. అయితే వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు జరిపిన ప్రయత్నాలు ఫలించడంతో బరిలో నిలిచిన రెండో అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దాంతో నాగ లలిత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి కె. శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆమె ఎంపికపై ఎంపీపీ కార్నైర్ల ప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ గార్లపాటి నాగ సుధా భూషణం హర్షం వ్యక్తం చేశారు.

రావిమెట్లలో సుగర్, బీపీ పరీక్షలు

నిడదవోలు రూరల్: పేదల కోసం దాతలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని రావిమెట్ల గ్రామంలో ఆ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 95 మందికి శనివారం సుగర్, బీపీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ సలహాదారుడు ఇంజే శేఖర్, గెల్లా రాజు, మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డెల్టాలకు నీటి విడుదల పెంపు



నిడదవోలు వద్ద నిండుగా ప్రవహిస్తున్న పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పాత ఉభయ గోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాల పరిధిలో రైతుల ఖరీఫ్ సాగు అవసరాల కోసం మూడు డెల్టాలకు గోదావరి నది నుంచి పూర్తి స్థాయిలో నీటి విడుదల చేస్తున్నారు. నీటి పారుదల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు డెల్టాల పరిధిలో కాలువలకు నీటి విడుదలను శనివారం పెంచారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు 7,500, మధ్య డెల్టాకు 2,600, తూర్పు డెల్టాకు 4,900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 967, తణుకు కాలువకు 786, అత్తిలి కాలువకు 590, నరసాపురం కాలువకు 2206, ఉండి కాలువకు 1470 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రమణమూర్తి భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి



రమణమూర్తి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: మండలంలోని కాకరపర్రు ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుడు కాపకా రమణమూర్తి (45) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందారు. విషయం తెలిసిన నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శనివారం ఉదయమే హుటాహుటిన కాకరపర్రు వచ్చి రమణమూర్తి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామానికి ఎప్పుడు వచ్చినా రమణమూర్తి ఎంతో ప్రేమతో ఆదరించేవాడని, అలాంటి నాయకుడు చనిపోయాడంటే జీర్ణించుకోలేకపోతున్నానని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కార్నైర్ల ప్రసాద్, చెర్ల శ్రీరామచంద్రమూర్తి, నామన ఆంజనేయులు, పలువురు నాయకులు ఉన్నారు.

తాడిపర్రులో 144 సెక్షన్ అమలు

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో శనివారం నుంచి 144 సెక్షన్ అమలులో ఉందని తహసీల్దార్ జి.కనకరాజు తెలిపారు. గ్రామంలోని ఓ సామాజిక వర్గం సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా, మరో సామాజికవర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. దాంతో కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ వర్మ, సీఐ కె.వెంకటేశ్వరరావు తదితరులు శనివారం గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందుగా గ్రామంలో 144 సెక్షన్ విధించారు.

సామాన్యుడి సేవాలయం

- అన్ని రకాల ప్రభుత్వ సేవలు అక్కడి నుంచే
- సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం సాకారం
- వివిధ వర్గాల ప్రజల హర్షాతిరేకాలు
- మండలంలో ఇప్పటికే 90 వేలకు పైగా సేవలు

12.08.2023 వరకూ సచివాలయాల ద్వారా పొందిన సేవలు

1.కరెంటు బిల్లులు	18,089
2.కుల ధ్రువీకరణ పత్రాలు	14,219
3.ఆదాయ ధ్రువపత్రాలు	13,824
4.1-బి అడంగల్	9,299
5.అడంగల్	5,139
6.పాత, కొత్త రేషన్ కార్డులు	3,461
7.రెవెన్యూ నీటి తీరువా	2649
8.రేషన్ కార్డులు	1944
9. పొలం పన్ను	2649
10. నీటి పన్ను	2341
మిగిలిన అన్ని రకాల సర్వీసులు	14,941
మొత్తం పొందిన సేవలు, పత్రాలు	90,378



అన్నవరప్పాడు సచివాలయ భవనం

పెరవలి: సచివాలయ వ్యవస్థ సామాన్యుడి దేవాలయంగా విరాజిల్లుతోంది. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుటూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి. నేడు లబ్ధిదారుడి ఇంటికే ఆ ధ్రువీకరణ పత్రం వస్తోంది. దీనికి ప్రధాన కారణం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ. సచివాలయాల ద్వారా వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు 426 రకాల సర్వీసులను అందిస్తోంది. ప్రజలు ప్రస్తుతం వాటిలో 318 సేవలను మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఈ సర్వీసుల్లో 72 గంటల లోగా అందేవి 187 ఉండగా, అంతకంటే ఎక్కువ సమయం పట్టే సర్వీసులు 279 ఉన్నాయి. సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టక ముందు సామాన్యులు దళారీలకు సొమ్ములు ఇచ్చి, వారి ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోవాల్సి వచ్చేది. ప్రభుత్వానికి చెల్లించే నామమాత్రపు ఫీజు కంటే దళారీలకు చెల్లించేదే ఎక్కువగా ఉండేది. ఈ విషయాన్ని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకు రావాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. ఈ వ్యవస్థ పనితీరు ఊహించిన దానికంటే ఎంతో మెరుగ్గా ఉండడంతో సచివాలయను ఇప్పుడు ప్రజలు దేవాలయాలుగా కొలుస్తున్నారు.

మండలంలో 21 సచివాలయాలు

2021 జనవరి1 నుంచి సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. పెరవలి మండలంలో 21 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా మండలంలో ఇప్పటి వరకూ ప్రజలు వివిధ రకాల 90,378 ధ్రువీకరణ పత్రాలను పొందారు. వాటిలో అత్యధికంగా కరెంటు బిల్లులు కట్టించుకోవడం, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1-బి అడంగల్, రేషన్ కార్డులు, వ్యవసాయ పన్నులు, నీటితీరువా, పంచాయతీ పన్నులు, కౌలు రైతు కార్డులు వంటి వాటిని ఆయా వర్గాల ప్రజలు తీసుకున్నారు. పింఛనుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే క్రమం తప్పకుండా పింఛన్లు అందుతున్నాయి. దాంతో వృద్ధులు, వితంతవులు, వికలాంగులు ఎంతో ఆనందిస్తున్నారు. సచివాలయ సేవల వలన పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది.

వలంటీర్‌కు చెబితే పనవుతోంది



గత ప్రభుత్వంలో పింఛను కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ ఈ ప్రభుత్వంలో ఇంటికే పింఛన్ సొమ్ము తీసుకొచ్చి ఇస్తున్నారు. సచివాలయాలు వచ్చిన తరువాత ఏ పని కావలసి వచ్చినా వలంటీరుకు చెబితే చేసి పెడుతున్నారు. మా సమయం, డబ్బు వృథా కావడం లేదు.

– కంకినీడి వెంకటేశ్వరరావు, ముక్కామల

ఎవరి చేయీ తడపాల్సిన పనిలేదు



కుల, లేదా ఆదాయ సర్టిఫికెట్ కావాలంటే రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. ఇప్పుడు ఆ అవసరం తప్పింది. వలంటీరుకు చెబితే నిర్ణీత సమయంలో ఇంటికే ఇంటికే సర్టిఫికెట్లు వస్తున్నాయి. ఏ అధికారినీ బతిమలాడాల్సిన పనిలేదు. ఎవరికీ చేయి తడపాల్సిన అవసరం అంతకంటే లేదు.

– కోటిపల్లి శ్రీనివాస్, అన్నవరప్పాడు

మరిన్ని సేవలకు ప్రణాళిక



సచివాలయ వ్యవస్థ ద్వారా మండల ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రణాళిక రూపొందిస్తోంది. అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం కూడా సిద్ధంగా ఉంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వోద్యోగులుగా మా బాధ్యత.

– దామోదరరావు, ఎంపీడీవో, పెరవలి

విక్రయానికి సేంద్రియ వరి సాగు కిట్లు



సేంద్రియ వరి సాగు కిట్లు

నల్లజర్ల: సేంద్రియ విధానంలో వరి పండించే రైతులకు అవసరమైన 100 కిట్లను అందుబాటులో ఉంచినట్టు ప్రకృతి వ్యవసాయ విభాగ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో కిట్టులో విత్తనం దగ్గర నుంచి పంట కోతకు వచ్చే వరకు ఉపయోగించే 5 కిలోల వేపపిండి, 3 లీటర్ల అగ్ని అస్త్రం, అర కిలో పాల ఇంగువ, ఆరు పురుగులను ఆకర్షించే ట్రాప్స్, పసుపురంగు అట్టలు 10, అజొల్లా 1 కిలో, అరలీటరు కోడిగ్రుడ్డు, నిమ్మరసం ఉంటాయన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాలలోనూ ఈ కిట్లను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ఒక్కో కిట్టు ధర రూ.500లని, పుల్లలపాడులో ఈప్రక్రియ చేపట్టినట్టు చెప్పారు.కార్యక్రమంలో ఐసీఆర్పీలు నాగలక్ష్మి, రామలక్ష్మి, దుర్గ, నరసింహారావు, వినయ్, మనోహర్ పాల్గొన్నారు.

మీ ఆదేశానుసారమే పనిచేశా



వైఎస్సార్ సీపీ కార్యకర్తల మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎన్నికల్లో మళ్లీ గెలిపించండి
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం

నల్లజర్ల: 'ఈ నాలుగున్నరేళ్లు మీ ఆదేశానుసారమే నడుచుకున్నాను. కార్యకర్తలకు, నాయకులకు తెలియకుండా ఏ పనీ చేయలేదు. మీ అండదండలతోనే గత ఎన్నికల్లో విజయం సాధించాను. అదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలి' అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను కోరారు. ఆ పార్టీ నల్లజర్ల మండల కార్యకర్తల సమావేశాన్ని అచ్చన్నపాలెంలోని కాకర్ల గంగరాజు కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులను సమావేశంలో పరిచయం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 15,20 ఏళ్లుగా చేయలేని అభివృద్ధి పనులను కూడా తమ హయాంలో పూర్తి చేశానన్నారు. మిగిలిన సమస్యల పైన ఇపుడు దృష్టి సారించానన్నారు. మండలంలో రహదారుల నిర్మాణ పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. కోర్టు కేసుల వల్ల కొన్ని గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని 110 లేఅవుట్లలో 70 చోట్ల బోర్లు వేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

16న నియోజకవర్గ స్థాయి సమీక్ష

ఈనెల16న దేవరపల్లిలో కలెక్టర్ మాధవీలత అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గోపాలపురం నియోజకవర్గ సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణు హాజరవుతారన్నారు.

అలాగే ఈనెల 17న అచ్చన్నపాలెం కల్యాణ మండపంలో సచివాలయానికి ముగ్గురు పార్టీ కన్వీనర్లకు బీమా చేయిస్తామన్నారు. నియోజకవర్గంలోని 80 సచివాలయాలకు సంబంధించి 240 మందికి పాలసీలు చేయిస్తామన్నారు.

ప్రతి మండలంలో ఎస్సీ, బీసీలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి స్థానికంగా వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేసినట్టు ఎమ్మెల్యే వెల్లడించారు.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరే రామకృష్ణ , వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వెలగదుర్రులో గోపూజ

ఉండ్రాజవరం: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని వెలగదుర్రు గ్రామంలో శనివారం వేగేశ్న రామకృష్ణంరాజు, సాయి పద్మలచే భక్తి శ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో పూజలు చేశారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు రామకృష్ణంరాజు తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు విచ్చేసి గోపూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు: పంట నాశనం చేయడమే గాకుండా, తనపై దాడి చేసి చంపుతామని బెదిరిస్తున్నారంటూ మద్దూరు గ్రామానికి చెందిన మేణ్ని శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదుపై అదే గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ శనివారం తెలిపారు. తన పొలంలో సాగుచేసిన బెండ, బీర, అరటి పంటలను చిట్టూరి వెంకట శ్రీనివాస్, చిట్టూరి వెంకటేశ్వరరావు అనే వారు ఈనెల 8న నాశనం చేశారని శ్రీరాములు ఫిర్యాదు చేశాడు. శ్రీరాములు పేరుతో ఉన్న భూమి విషయంలో నిందితులు అతడితో గొడవ పడుతున్నారు. నిందితులు శ్రీరాములుకు సమీపం బంధువులే.

స్పందన అర్జీల పరిష్కారంపై సమీక్ష

నిడదవోలు రూరల్: స్పందన వినతులతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.గంగరాజు సూచించారు. నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన, గ్రామాల్లో వచ్చిన వివిధ వినతులపై శనివారం అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందించడంతో సచివాలయాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు తగ్గాయన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చిన ఏ సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొట్టి గాయపరిచిన కేసులో ఇద్దరిపై కేసు

కొవ్వూరు: తన మేనమామ పాతాళ ఏసురత్నం, అతడి భార్య నాగమణి తనను కొట్టి గాయపరిచినట్టు పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన ఎస్.రత్నకుమారి కొవ్వూరు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్టు పట్టణ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు. తన తల్లికి చెందిన ఇంటి విషయంతో మేనమామ, ఆయన భార్య గొడవ పడి తనను కొట్టినట్లు రత్నకుమారి తన ఫిర్యాదులో పేర్కొంది.

వైద్య కళాశాలల్లో రిజర్వేషన్ శాతం పెంచాలి

కొవ్వూరు: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లను మాత్రమే రిజర్వేషన్లకు కేటాయించడం బాధాకరం అని మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బొంతా శ్యాం రవి ప్రకాష్ పేర్కొన్నారు. మొత్తం 750 సీట్లకి గాను 15 శాతం అంటే 113 సీట్లను అలిండియా కోటా కింద తీసేస్తే, మిగిలిన 637 సీట్లలో 50 శాతం రిజర్వేషన్ వర్తించేలా జీవో 107, 108 ద్వారా భర్తీ చేస్తున్నారన్నారు. దీనివల్ల ఎస్సీలు 48 సీట్లను కోల్పోతున్నామని ఆరోపించారు.ఈ ప్రక్రియ మూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 107,108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల అమ్మకాలు

తాళ్లపూడి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని పోస్టాఫీసులలోనూ జాతీయ పతాకాలను విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లోను, నేరుగా కూడా జాతీయ జెండాల అమ్మకాలు చేస్తున్నట్టు తాళ్లపూడి పోస్ట్ ఆఫీసు పోస్టు మాస్టర్ రాజేష్ తెలిపారు. ఒక్కో జెండాను రూ.25 రేటుకు విక్రయిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారు సంప్రదించాలన్నారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

గోపాలపురం: విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. రాజమహేంద్రవరం నుంచి శనివారం జంగారెడ్డిగూడెం వెళుతున్న కంటైనర్ లారీ గోపాలపురం పొగాకు బోర్డు సమీపంలో ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టి, మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహానీ జరగలేదు. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో గొల్లగూడెం, అవంతి ఫ్యాక్టరీలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు చేస్తున్నట్టు ఏడీఈ రవిశంకర్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

చాగల్లు: మండలంలో చంద్రవరం గ్రామానికి చెందిన 15 ఏళ్ల కాట్రు అక్షయకుమార్ అనే తొమ్మిదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ గ్రామానికి చెందిన అక్షయకుమార్ ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కువ సేపు సెల్ ఫోన్‌తో గడుపుతుండడంతో అతడిని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన ఆ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటాడని భావిస్తున్నారు. బాలుడు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేశారు.

12 మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: ఓటర్ల ప్రత్యేక సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 12 మందికి బూత్ లెవెల్ అధికారుల (బీఎల్‌ఓ)లకు కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలతో ఆర్డీవో సమీక్ష జరిపారు. ఈనెల 21వ తేదీ నాటికి సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కొందరు బీఎల్‌వోలు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడం సరికాదని ఆర్డీవో హెచ్చరించారు. ఓటర్ల వివరాల నమోదుకు యాప్‌లో ఏదైనా సాంకేతిక సమస్య ఏర్పడితే మాన్యువల్‌గా వివరాలు సేకరించాలని సూచించారు. సర్వే ను మరింత వేగవతం చేసి తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని ఆదేశించారు.

గద్దర్ మృతి సాంస్కృతిక విప్లవానికి లోటు



గద్దర్‌కు సంతాపం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

నిడదవోలు: జన నాట్యమండలి వ్యవస్థాపకుడైన గద్దర్ ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు, సాంస్కృతిక విప్లవానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెడ్డింగి చిట్టిబాబు అన్నారు. గద్దర్ సంతాప సభను శనివారం పట్టణంలోని టౌన్ హాల్లో దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. కుల నిర్మూల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వెడ్డింగి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తన ఆటపాటలు, మాటలతో ప్రజా, రైతాంగ ఉద్యమాలను గద్దర్ ఎంతో ఉత్తేజపరిచారన్నారు. దళిత మహాసభ నాయకుడు పిల్లి డేవిడ్ కుమార్ మాట్లాడుతూ 1985 కారంచేడు దళితుల నరమేధానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో గద్దర్ పెద్దన్న పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు మెరుపా జాన్ రాజ్, ఎస్కే మస్తాన్ , కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు, దళిత మహాసభ నాయకులు పిల్లి సురేష్, సామాజికవేత్త చిర్రా గోపాల్, దళిత రక్షణదళం నాయకుడు కొడమంచిలి రమణ, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు కందుల ప్రభాకర్, బీఎస్పీ నిడదవోలు నియోజకవర్గ నాయకులు బయ్యే మునీంద్ర, రాజన్‌బాబు పాల్గొన్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యాన్ని అందిస్తున్న దృశ్యం

చాగల్లు: మండలంలోని గౌరిపల్లి గ్రామంలోని 10 మంది నిరుపేదల కుటుంబాలకు శనివారం కొవ్వూరుకు చెందిన మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యాన్ని పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు, న్యాయవాది కోడె ప్రసాద్‌లు ఒక్కో కుటుంబానికి 15 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ నిరుపేదలకు ట్రస్ట్ ద్వారా బియ్యాన్ని అందించడమే గాకుండా ఆయా కుటుంబాల్లో నలుగురిని ప్రతి నెలా 1న హెల్త్ మెడికల్ పెన్షన్ నిమిత్తం ఎంపిక చేస్తున్నామన్నారు. గౌరిపల్లి వార్డు సభ్యులు సాక సౌజన్య, లక్ష్మీవరపు నాగవరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లూరి హేమావతి, తాళ్లూరి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

నిడదవోలు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అధ్యాపకులు, విద్యార్థులు మట్టిని చేతులతో తీసుకొని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు జ్యోతులను వెలిగించి దేశభక్తిని చాటారు.

జ్యోతులను ప్రదర్శిస్తున్న దృశ్యం →



ఎరియర్స్ మొత్తం ఒకేసారి చెల్లించాలి

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మానవత సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సంఘాధ్యక్షుడు జీవీఎల్ కృష్ణారావు సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ పెన్షనర్లకు పీఆర్సీ ఎరియర్స్ మొత్తం ఒకే దఫాగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కుందుల ప్రభాకరం, ఎంబీకే వాసుదేవరావు, పి.నరసింహరాజు, షేక్ హుస్సేన్ షరీఫ్, గొల్లపల్లి విజయ లక్ష్మి, రత్నం, గువ్వల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.